చినుకు పడితే చీకటే

- వాగులోనే విద్యుత్ సబ్‌స్టేషన్
- ముంపునకు గురైతే విద్యుత్ సరఫరా ఆగిపోయినట్లే
- మరమ్మతులకు రూ.లక్షల్లో ఖర్చు



వెంకటాపురం వాగు వరద ఉధృతికి ముంపునకు గురైన కుంటముక్కల విద్యుత్ సబ్‌స్టేషన్ (ఫైల్)

జి.కొండూరు: జి.కొండూరు మండల పరిధి కుంటముక్కల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రమాదంలో ఉంది. వెంకటాపురం వాగుని ఆనుకొని 30వ నంబర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ వర్షాలు కురిసి వరద వస్తే ముంపునకు గురై విద్యుత్ సరఫరా నిలిచిపోయి అటు ప్రజలకు విద్యుత్ సమస్య, ఇటు విద్యుత్ శాఖకు ఖర్చు రూపంలో భారంగా మారుతుంది. ఈ ఏడాది ఆగస్టు 30న కురిసిన భారీ వర్షాలకు వెంకటాపురం వాగు ఉగ్ర రూపం దాల్చింది. ఈ వరద ఉధృతికి వాగు పక్కనే కుంటముక్కల గ్రామ పరిధిలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పూర్తిగా నీట మునిగింది. సిబ్బంది ఉండే గది వాగులోకి ఒరిగిపోయింది. దీనితో చేసేదిలేక విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీని వల్ల జి.కొండూరు మండల పరిధిలోని చెవుటూరు, వెంకటాపురం, గుర్రాజుపాలెం, కుంటముక్కల, చిన్న నందిగామ, కోడూరు, కంద్రిక, బీమవరప్పాడు, సీతారాంపురం, వెల్లటూరు గ్రామాలకు 30 గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఆయా గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవించారు. ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో సరఫరా నిలిచిపోయిన 30 గంటల తర్వాత మరొక సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్‌ను అందించారు. వరద ఉధృతి తగ్గుముఖం పట్టిన తర్వాత రెండు రోజుల పాటు 200 మంది కార్మికులతో రూ.35 లక్షలకు పైగా వెచ్చించి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పునరుద్ధరించారు. సెప్టెంబరు 2వ తేదీన సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను ప్రారంభించారు.

గ్రామాలకు వెలుగునిచ్చే విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రమాదంలో ఉంది. రహదారి నుంచి పది అడుగులకు పైగా లోతులో వాగుని ఆనుకొని ఉంది. వర్షం పడితే చాలు వాగుకు వచ్చే వరదతో సబ్‌స్టేషన్ ముంపునకు గురవుతోంది. గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వరద ఉధృతి పెరిగితే రోజుల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. పునరుద్ధరణకు రూ.లక్షల్లో ఖర్చు పెట్టాల్సిందే. అదేదో మెరక ప్రదేశంలోకి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మార్చితే ముంపు సమస్యతో పాటు ప్రజలకు విద్యుత్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.



ప్రస్తుతం విద్యుత్ సబ్‌స్టేషన్ ఇలా ..

మెరక ప్రదేశానికి మార్చాల్సిందే

కుంటముక్కల విద్యుత్ సబ్‌స్టేషన్ 30వ నంబర్ జాతీయ రహదారి నుంచి పది అడుగులకు పైగా లోతులో ఉంది. వెంకటాపురం వాగు ఈ జాతీయ రహదారిని దాటే ప్రదేశంలోనే ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉండడంతో ప్రమాదకరంగా మారింది. కొద్దిపాటి వరద వచ్చినా వరద ముంపునకు గురై ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తుగానే విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సి వస్తోంది. అంతే కాకుండా అర్ధరాత్రి సమయంలో వాగు ఉధృతి పెరిగితే సబ్‌స్టేషన్‌లో పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్లు సైతం ప్రాణాలను కోల్పోయే ప్రమాదం ఉంది. కనుక ఈ సబ్‌స్టేషన్‌ను వెంటనే మెరక ప్రదేశానికి మార్చితే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

క్లుప్తంగా

నెమలి వేణుగోపాలస్వామిని దర్శించుకున్న రమణమూర్తి



నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ రమణమూర్తి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలో పాల్గొన్న రమణమూర్తిని అర్చకులు ఆశీర్వదించి ప్రసాదం, స్వామి వారి మెమోంటోను అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ తెల్ల మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పణ



మైలవరం: ద్వారకా తిరుమలలోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆశ్వయుజ తిరు వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మైలవరం జమీందారు, ఆలయ చైర్మన్ ఎస్‌వీ సుధాకర రావు, ఆలయ ధర్మకర్త ఎస్‌వీఎస్ నివృతరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్‌వీఎస్ఎన్ మూర్తి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారు, అమ్మవార్లకు వేద పండితులు పట్టు వస్త్రాలు అలంకరించారు. మంగళ వాయిద్యాలు, పండితుల వేద మంత్రాల నడుమ స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారి ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో, స్వామి వారి కల్యాణ మండపాన్ని పూలతో అలంకరించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ



నూజివీడు: పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ మస్తాన్‌వలీ మాతృమూర్తి ఇటీవల మరణించింది. మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం రాత్రి ఎమ్మార్ అప్పారావు కాలనీకి వెళ్లి మస్తాన్‌వలీని పరామర్శించి సానుభూతి తెలిపారు.

అంతర్ యూనివర్సిటీ సెలక్షన్స్ నిర్వహణ



నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో పలు క్రీడలకు సంబంధించి సెలక్షన్స్ నిర్వహించారు. సౌత్ జోన్, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఆర్జీయూకేటీ జట్టు ఎంపిక నిమిత్తం కబడ్డీ, షటిల్, బాస్కెట్‌బాల్, ఫెన్సింగ్ క్రీడల్లో జట్ల ఎంపికకు ఆటల పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు తమిళనాడులోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఆటల పోటీల్లో, జమ్మూకశ్మీర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

ముసురు వాతావరణంతో రైతుల ఆందోళన



చాట్రాయి: కోతకు వచ్చిన వరి పంట చేతికి దక్కుతుందో లేదో అని మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 9 వేల ఎకరాల్లో సోనా మసూరి, ముతకల రకాలు సాగు చేస్తున్నారు. మారిన వాతావరణంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 1010 రకం ముతకలు కోత దశకు రాగా.. వర్షాలకు కోతలు కోయలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోత దశకు వచ్చిన 1010 రకం వరి పంట కోయడానికి వరి కోత యంత్రాల కొరత ఏర్పడింది. అరకొరగా ఉన్న యంత్రాలు రైతులకు అందుబాటులో లేవు. బురదగా ఉన్న పొలాల్లో వరి కోయాలంటే చైన్ మిషన్లు కావాల్సి వస్తోంది. చైన్ మిషన్లతో వరి కోయాలంటే గంటకు రూ.3,500 ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. పంటను తక్కువ ధరకు అమ్మాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు.

నేడు 'మీ కోసం'

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆర్డీఓ మొవిడి వాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

గంపలగూడెం: మండలంలోని 10 రెవెన్యూ గ్రామాల్లో సోమవారం నుంచి రెవెన్యూ గ్రామ సభలు జరుగుతాయని తహసీల్దార్ రాజకుమారి ఆదివారం తెలిపారు. 21న రాజవరం, 22న చెన్నవరం, 23న అనుముల్లంక, 24న గంపలగూడెం, 25న కనుమూరు, 26న వినగడప, 29న గుళ్లపూడి, 30న నెమలి, నవంబర్ ఒకటిన కొత్తపల్లి, 2న పెద్ద కొమిర గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయని వివరించారు.

700 మందికి నేత్ర వైద్య పరీక్షలు

నూజివీడు: ట్రిపుల్ ఐటీ హెల్పింగ్ హ్యాండ్స్, అశ్వనీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా పెడన మండలం దామోజీపాలెంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 700 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 354 మందికి కళ్లజోళ్లు, 152 మందికి కంటి శుక్లాలు శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి త్వరలోనే విజయవాడలోని చైతన్య కంటి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

రూ.5.16 కోట్లతో రహదారుల అభివృద్ధి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్



వెలగలేరులో రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వసంత

జి.కొండూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మంజూరైన రూ.5.16 కోట్లతో జి.కొండూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో 41 సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధి వెలగలేరు 2, చెవుటూరు 2, కట్టబడిపాలెం 2, పినపాక 2, జి.కొండూరు 5 రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రహదారుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రూరల్ మండలంలో..

విజయవాడరూరల్: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. రాయనపాడు గ్రామంలో రెండు రోడ్ల నిర్మాణానికి రూ. 60 లక్షలు, జక్కంపూడి గ్రామంలో 3 రోడ్ల నిర్మాణానికి రూ.36.3 లక్షలు, షాబాదలో రోడ్డు నిర్మాణానికి రూ.3.70 లక్షలు, కొత్తూరు తాడేపల్లి గ్రామంలో 5 రోడ్ల నిర్మాణానికి రూ. కోటి 90 లక్షలు, పైడూరుపాడు గ్రామంలో 2 రోడ్ల నిర్మాణానికి రూ. 42.80 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. ఆయా గ్రామాల్లోని పార్టీ నాయకులు, జనసేన నాయకుడు ఎ.రామ్మోహనరావు, అధికారులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ రామకృష్ణ

చాట్రాయి: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. సత్ప్రవర్తన ఉంటే రౌడీషీట్లను తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని చెప్పారు.

డంపింగ్ యార్డులా బైపాస్ రోడ్డు

- చెత్తచెదారంతో నిండిన రోడ్డు మార్జిన్లు
- చెత్తకుళ్లి దుర్వాసన వెదజల్లుతున్న వైనం
- కుంచించుకుపోతున్న బుడమేరు వాగు



బైపాస్ రోడ్డులో పేరుకుపోయిన చెత్తచెదారం

గతంలో ఇలా..

మైలవరం: మైలవరం నుంచి తిరువూరు వెళ్లే జాతీయ రహదారి డంపింగ్ యార్డును తలపిస్తోంది. మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల రింగ్ సెంటర్ నుంచి వెల్వడం రోడ్డు రింగ్ సెంటర్ వరకు ఉన్న జాతీయ రహదారి పక్కనే బుడమేరు వాగు ఉంది. మైలవరం పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది గ్రామంలో సేకరించిన చెత్త చెదారాన్ని బుడమేరు వాగులో డంప్ చేస్తుండటంతో వాగు కుంచించుకుపోతోంది. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తే వరద నీరు గ్రామంలోకి ప్రవేశిస్తుంది. గతంలో వరద నీరు సమీపంలోని కాలనీల్లోని ఇళ్లల్లోకి ప్రవేశించకుండా వాగులో పూడిక పనులు చేపట్టి వెడల్పు చేశారు.

ముక్కుమూసుకుని రాకపోకలు

ప్రస్తుతం ఎవరూ పట్టించుకోక పోవడంతో వాగు సమీపంలోని ఇళ్లల్లోని వారు కూడా చెత్తచెదారాన్ని, కోళ్ల, ఇతర వ్యర్థాలను కూడా ఇక్కడే పడేస్తుండటంలో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ రహదారిపై ప్రయాణించేవారు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని పాదచారులు, వాహన చోదకులు వాపోతున్నారు. రహదారికి రెండో వైపున ప్రభుత్వ పాఠశాల ఉంది. వాగులో పడేస్తున్న చెత్తచెదారం కుళ్లిపోయి వచ్చే దుర్వాసనతో పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

గతంలో మైలవరం సమీపంలోని పూరగుట్టలో రెండు ఎకరాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. కొంత కాలం పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది పూరగుట్టలోని డంపింగ్ యార్డుకు ట్రాక్టర్‌తో తరలించేవారు. ప్రస్తుతం ఆ ప్రక్రియను నిలిపివేసి మైలవరం బుడమేరు వాగును డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మైలవరంలో సేకరించిన చెత్తచెదారాన్ని పూరగుట్టలోని డంపింగ్ యార్డుకు తరలించాలని గ్రామస్తులు, వాహన చోదకులు కోరుతున్నారు.

పూరగుట్టకు తరలించాలి

ప్రతి రోజూ నేను వాహనంపై ఈ రోడ్డు నుంచే విజయవాడకు వెళ్లి వస్తుంటాను. ఈ రోడ్డులో వెళ్లాలంటేనే భయమేస్తోంది. ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దుర్వాసన పీల్చడం వలన ఇబ్బంది పడుతున్నాను. శ్వాసకోశ వ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చెత్తచెదారాన్ని పూరగుట్టలోని డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు చేపట్టాలి.
– పి.సూర్యతేజ, వాహన చోదకుడు, మైలవరం

వాగును తవ్వేస్తున్న అక్రమార్కులు

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పగలు ట్రాక్టర్లు, రాత్రిళ్లు లారీలతో ఎగుమతి
- లారీ ఇసుక రూ.30వేల నుంచి రూ. 50వేల వరకు విక్రయం



గణపవరం శివారులో డంప్ చేసిన ఇసుక గుట్టలు

జి.కొండూరు: అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాను ఆదాయ వనరుగా మార్చుకున్న అధికార పార్టీ నాయకులు కొందరు వాగులను తోడేస్తున్నారు. పగలు ట్రాక్టర్లతో తరలించి డంప్ చేసిన ఇసుకను రాత్రి సమయాల్లో లారీలతో ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంటి అవసరాలకు ట్రాక్టరుతో ఇసుకను తరలించుకోవచ్చని ప్రభుత్వం చెప్పిన మాటలే అక్రమార్కులకు అండగా నిలుస్తున్నాయి. అధికారులు సైతం వదిలి వేయడంతో అక్రమార్కులకు అడ్డేలేకుండా పోయింది.

నిత్యం వందలాది ట్రాక్టర్లతో తరలింపు..

మైలవరం, జి.కొండూరు మండలాల పరిధిలో ఉన్న బుడమేరు వాగుని ఇసుక తవ్వకాలకు అనువైన ప్రదేశంగా అక్రమార్కులు ఎంచుకున్నారు. ఈ వాగు నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లతో ఇసుకను తరలించి మైలవరం మండల పరిధి గణపవరం గ్రామ శివారులోని గణపతి గట్టురోడ్డులో ఇసుకను డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రి సమయాల్లో లారీలతో విజయవాడ పరిసర ప్రాంతాలతో పాటు ఇతర జిల్లాలకు సైతం తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇసుక గుట్టల వద్ద కాపలా..

అక్రమ రవాణా గురించి తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆదివారం ఉదయం నుంచి డంప్ చేసిన ఇసుక గుట్టల వద్ద కాపలా కాస్తున్నారు. ఒక్కో రాత్రికి 20 నుంచి 30 లారీల వరకు ఇసుక మైలవరం, జి.కొండూరు మండలాల నుంచి తరలిపోతున్నట్లు తెలుస్తోంది. డిమాండ్‌ను బట్టి లారీ ఇసుక రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు విక్రయిస్తున్నారు.

మారిపోతున్న వాగు స్వరూపం

సాక్షాత్తూ ముఖ్యమంత్రే ఇంటి అవసరాలకు ట్రాక్టర్లతో ఇసుకను తరలించుకోవచ్చని చెప్పడంతో ఇదే అదునుగా భావించి వందల ట్రాక్టర్లతో అక్రమ రవాణాకు తెరలేపారు. ముఖ్యమంత్రే స్టేట్‌మెంట్ ఇచ్చారు కాబట్టి తాము సైతం పట్టించుకోవాల్సిన పనిలేదన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. దీనితో ఇసుక అక్రమ వ్యాపారానికి అడ్డేలేకుండా పోయింది. ప్రతి రోజూ వందల ట్రాక్టర్లతో బుడమేరు నుంచి ఇసుకను తరలించడం వల్ల వాగు భౌతిక స్వరూపం మారిపోతోంది. దీనివల్ల వరద వచ్చినప్పుడు బుడమేరు పొంగి సమీప గ్రామాలు, పంట భూములు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి కట్టడాలకు అవసరమైన వారికి ఇసుకను అందించి, అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

మామిడితోటల్లో డంపింగ్

మైలవరం: మైలవరం మండలం గణపవరం గ్రామంలోని గణపతి గట్టు సమీపం ఇసుక డంపింగ్‌కు అక్రమార్కులకు అడ్డాగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీపై క్లారిటీ ఇచ్చింది. అధికార పార్టీ నాయకులు ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మార్చుకున్నారు. పగటి పూట ట్రాక్టర్లతో చుట్టుపక్కల గ్రామాలలోని బుడమేరు వాగు నుంచి ఇసుక లోడ్ చేసుకుని మైలవరం మండలం గణపవరం గ్రామం గణపతి గట్టు సమీపంలోని మామిడి తోటల్లో డంప్ చేసి రాత్రి పూట లారీలలో హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం.

శోభనాపురంలో మినుము రైతుల నిరసన

నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్



శోభనాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, నాయకులు

నూజివీడు: రామిలేరు వరదలకు మినుము పంట దెబ్బతిని రైతులు నష్టపోయినా పంట నష్టం నమోదు చేయకపోవడం అన్యాయమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ ధ్వజమెత్తారు. రామిలేరు వరదకు నష్టపోయిన మినుము రైతులకు నష్టపరిహారం చెల్లించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నూజివీడు మండలం పల్లెర్లమూడి శివారు శోభనాపురంలో ఆదివారం మినుము రైతులు నిరసన వ్యక్తంచేశారు. తమకు నష్టపరిహారం చెల్లించాలని నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ పంట నష్టాల నమోదు నిబంధనలు సవరించి రైతులను ఆదుకుంటామని ముఖ్యమంత్రి స్వయంగా చెప్పినా పంట నష్టం నమోదు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. శోభనాపురంలో 30 ఎకరాలకు పైగా మినుము పంట వరదకు దెబ్బతినడంతో పాటు పంట భూములు కోతకు గురవ్వడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మినుము పంట నష్టాన్ని నమోదు చేసి ఎకరాకు రూ.15 వేలు నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంటా పాపారావు, మినుము రైతులు పోలగాని కొండయ్య, మెరుగు రమేష్, చేబత్తిన ఆదాం, కొలుసు వెంకటేశ్వరరావు, చేబత్తిన ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.

1,030 మందికి మందుల పంపిణీ



తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరువూరు నాగార్జున పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, ఫిట్స్ వ్యాధి బాధితులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తక్కువ ధరకు మందులను అందజేశారు. వైద్యులు సత్యతేజ, రవీంద్ర, లక్ష్మణరావు, జన విజ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తిరువూరు: తిరువూరులో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి దాత ఆదివారం రూ. 21,110 విరాళంగా ఇచ్చారు. పట్టణానికి చెందిన ఆర్య వైశ్య ప్రముఖులు గుడిమెట్ల మురళి, విజయలక్ష్మి దంపతులు ఈ మొత్తాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. వంశపారంపర్య ధర్మకర్తలు వి. సురేంద్రబాబు, కమిటీ సభ్యులు సుబ్బారావు, వెంకటేశ్వరరావు, అర్చకులు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు



గంపలగూడెంలో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమ ప్రాధాన్యత నిచ్చి అమలు చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని 8 గ్రామాల్లో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో మంజూరైన సీసీ రోడ్లకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. గోసవీడు, అమ్మిరెడ్డిగూడెం, కొత్తపల్లి, వినగడప, అనుముల్లంక, కనుమూరు, గంపలగూడెం గ్రామాల్లో మంజూరైన పనులకు ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించి మాట్లాడారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● **తిరువూరు రూరల్:** రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోలుబడి, గానుగపాడు గ్రామాలకు మంజూరైన సిమెంట్‌రోడ్లకు ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.